జగన్‌తోనే మహిళలకు భరోసా

- ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తామంటున్న మహిళలు
- బాలినేని శచీదేవి, శ్రీకావ్య ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన



50వ డివిజన్ నెహ్రూకాలనీలో ప్రచారం చేస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే మహిళలకు భరోసా, ఆర్థిక స్వేచ్ఛ లభిస్తోందని, వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకే ఓటేస్తామని మహిళలు స్పష్టం చేస్తున్నారు. ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి, కోడలు శ్రీకావ్య నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఏ డివిజన్‌కు వెళ్లినా ఫ్యాన్ హవా కనిపిస్తోంది. స్థానిక 50వ డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో శనివారం బాలినేని శచీదేవి ప్రచారం నిర్వహించగా, 11వ డివిజన్‌లోని విజేత వీధిలో బాలినేని శ్రీకావ్య పాల్గొన్నారు. 'మహిళలతో మమేకం-స్త్రీశక్తితో శచీదేవి' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వీరి ప్రచారాలకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలు స్వచ్ఛందంగా వారిని తమ ఇళ్లకు ఆహ్వానిస్తూ ఆత్మీయత, అభిమానాన్ని చాటుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇన్ని సంవత్సరాలకు ప్రజల కష్టాలను నేరుగా గుర్తించి అవసరమైన పథకాలు అమలు చేసే జగన్ లాంటి నాయకుడు రావడం ఆనందంగా ఉందన్నారు. నాయకుడు స్ఫూర్తిగలవాడైతే పాలన ఎలా ఉంటుందో, ఎంత జనరంజకంగా ఉంటుందో అందరికీ తెలిసివచ్చిందంటూ పలువురు మహిళలు పేర్కొన్నారు. గతంలో పిల్లలను బడికి పంపితే ఫీజు కట్టలేదని బయట నుంచోబెట్టినప్పుడు తమ గుండెలు ఎంతగా ఆక్రోశించాయో గుర్తుచేసుకున్నారు. తాము స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి కాస్త ఆలస్యంగా ఫీజులు కడతామని, పిల్లలను చదువుకోనివ్వాలని బతిమాలినా అప్పట్లో కనికరించలేదని తెలిపారు. గత టీడీపీ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వకుండా ఎంతగా తిప్పలు పెట్టారో అందరికీ తెలుసన్నారు. కానీ, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి జగన్ సీఎం అయిన తర్వాత పాత బకాయిలతో పాటు దశల వారీగా విద్యార్థుల ఫీజు బకాయిలన్నీ తీర్చారని ఆనందం వ్యక్తం చేశారు. లబ్ధి పొందిన ప్రతి కుటుంబంలో జగనన్న సభ్యుడై ఉన్నారన్నారు. పిల్లల పుస్తకాల అట్టలపై జగన్‌ను చూసి భయపడే టీడీపీకి తమ గుండెల్లో ఉండే జగనన్నను ఎలా తొలగించగలరంటూ ప్రశ్నించారు.

టీడీపీ నేతలు భయపెడుతున్నారు...

జగనన్న అంటే వ్యక్తి కాదని, అతనో శక్తి అని చంద్రబాబు గ్రహించారని, అందుకే అడుగడుగునా భయపడుతున్నాడని పలువురు మహిళలు బాలినేని శచీదేవి, బాలినేని శ్రీకావ్యలతో అన్నారు. చివరకు ఇళ్లకు వచ్చి ఫోన్ నంబర్ చెప్పాలని, ఓటీపీ చెప్పాలని, లేనిపక్షంలో వాటిని బ్లాక్ లిస్టులో ఉంచి అధికారంలోకి రాగానే తామేంటో చూపిస్తామంటూ టీడీపీ నేతలు హెచ్చరిస్తున్నారని శచీదేవి, శ్రీకావ్యల దృష్టికి తెచ్చారు. తాము ఇన్నేళ్లుగా ఎన్నో ఎన్నికల్లో ఓట్లు వేశామని, కానీ, నేడు ఈ పోకడలు మాత్రం సరికాదని అన్నారు. శంఖారావం పేరుతో ఓటీపీ అడుగుతూ కక్షపూరిత వాతావరణం సృష్టిస్తున్న టీడీపీ నాయకుల గురించి ఎన్నికల సంఘం అధికారులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలని, వారి సెల్‌ఫోన్లను కూడా సీజ్‌చేసేలా చూడాలని పలువురు మహిళలు శచీదేవిని కోరారు. ఆమె మాట్లాడుతూ జగన్ అంటే ఒక భరోసా అని, వాసన్న అంటే ఒక నమ్మకం అని అన్నారు. మీ నమ్మకాన్ని తాము ఎన్నడూ విస్మరించమని స్పష్టం చేశారు. కరోనా సమయంలో పెద్ద పెద్ద నేతలు సైతం జనాలకు కనిపించకుండా అదృశ్యమైతే.. వాసన్న మాత్రం అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు. కరోనా సమయంలో జూమ్ మీటింగ్‌లకు పరిమితమైన వారు నేడు జనం వద్దకు ఎందుకు వస్తున్నారో గమనించాలన్నారు. కేవలం ఓట్ల కోసం మభ్యపెట్టేవారికి గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని శచీదేవి పిలుపునిచ్చారు. లబ్ధిదారులు, అభిమానులే తమ బలమని అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి టీడీపీకి సరైన గుణపాఠం చెప్పాలని కోరారు. శచీదేవి వెంట స్థానిక కార్పొరేటర్ అంబటి ప్రసాదరావు, సుబ్బులు, సురేష్, శ్రీదేవి, ధనలక్ష్మి, తోటపల్లి రవి, చిన్నమ్మాయి, రాష్ట్ర టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ సుభానీబీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, విజయ, వాణి, బత్తుల మరియమ్మ, గృహలక్ష్మి, రవణమ్మ, రాజేశ్వరి, రజని, కార్పొరేటర్ తాడి కృష్ణలత పాల్గొన్నారు. 11వ డివిజన్‌లో శ్రీకావ్య వెంట ఆ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు జాన్ ఇసాక్, ఉపాధ్యక్షుడు కావూరి కిరీటి, క్లోపేట క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రంజిత్, కల్లం దీపక్, కో ఆప్షన్ మెంబర్ శ్యాంసుందర్, చిట్టీ, నార్న్, ఆల్డా చైర్మన్ కోసూరి రాధ, గంటా రమ్య, వల్లెపు మురళి, నత్తల భీమేష్, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, దాసరి కరుణాకర్ పాల్గొన్నారు.

దేశ రక్షణకు పోరాటాలు చేయాలి



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న సుబ్బారావు, తదితరులు



సభలో ప్రసంగిస్తున్న చుండూరి రంగారావు

ఒంగోలు టౌన్: మతోన్మాద శక్తుల చేతుల్లో పడి విలవిల్లాడుతున్న దేశాన్ని రక్షించుకునేందుకు యువకులు, విద్యార్థులు భగత్‌సింగ్‌లా పోరాటాలు చేయాలని సీపీఐఎంఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి బి.సుబ్బారావు పిలుపునిచ్చారు. అమర వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి చర్చి సెంటర్ వరకు శనివారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు ప్రసంగిస్తూ ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ విధానాల వలన దేశం అన్ని రంగాల్లో సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. దేశ ప్రజల సంపదను కొల్లగొట్టే కార్పొరేట్ శక్తుల దోపిడీకి అండగా నిలుస్తున్న మోదీ సర్కార్‌ను గద్దె దింపాలని కోరారు. ఒక మనిషిని మరొక మనిషి దోచుకోని సమసమాజాన్ని కలలుగన్న భగత్‌సింగ్ ఆశయాల కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. కాగడాల ప్రదర్శనలో చావలి సుధాకర్, ఎల్.వెంకటేశ్వర్లు, ఎం.రమేష్, చక్రపాణి, సునీల్, సుధాకర్, కరవది సుబ్బారావు, పిన్నికి శ్రీను, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదంపై అలుపెరుగని పోరాటం

ఒంగోలు టౌన్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ త్యాగాల స్ఫూర్తితో మతోన్మాదంపై అలుపెరుగని పోరాటం చేయాలని, దేశాన్ని రక్షించుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో అమరవీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ అతి పిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగాలకు పాల్పడిన భగత్‌సింగ్, అతడి అనుచరుల జీవితాలను నేటి తరం యువత అధ్యయనం చేయాలని కోరారు. కులమతాలకు అతీతంగా దేశం కోసం ఉరికంభాన్ని ముద్దాడిన వీరులు మళ్లీ పుట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజల బతుకులు దినదిన గండంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని సైతం పక్కన పెట్టేయాలన్న ప్రయత్నాలతో అన్నివర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాలు, మైనారిటీ ముస్లింలు అభద్రతా భావంతో గడిపే పరిస్థితి రావడం మంచి పరిణామం కాదని అన్నారు. రైతుల హక్కులు కాలరాసి కార్పొరేట్లకు వ్యవసాయాన్ని అప్పజెప్పే కుట్రలను తిప్పికొట్టకపోతే చివరికి పేదలు, సామాన్యులు అన్నం మెతుకుల కోసం అగచాట్లు పడాల్సి వస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎలాంటి పాత్ర లేని నాయకుల చేతిలో ప్రభుత్వం ఉండటమే ఈ దేశానికి శాపంగా మారిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు విమర్శించారు. సభకు ఎల్.రాజశేఖర్, లెనిన్, రమాదేవి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. కార్యక్రమంలో చావలి సుధాకర్, ఎస్‌డీ సర్దార్, శ్రీరాం శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, వి.బాలకోటయ్య, జార్జ్, జయంతి బాబు, రాజగోపాల్‌రెడ్డి, ఎస్‌కే బాబు, ఎంఏ సాలార్, మహేష్ పాల్గొన్నారు.

సజీవ పాత్రల తేజోమూర్తి.. అక్కినేని



అక్కినేనికి నివాళులర్పిస్తున్న కళా పరిషత్ సభ్యులు

ఒంగోలు మెట్రో: సజీవ పాత్రల తేజోమూర్తి.. దివంగత నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అని ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాఖ్యాత పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. అక్కినేని కళాపరిషత్ వ్యవస్థాపకుడు కల్లగుంట వెంకటేశ్వర్లు 10వ వర్ధంతి సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూంలో ఘంటసాల, అక్కినేని గీతాలతో సంగీత విభావరి నిర్వహించారు. అక్కినేని మాత్రమే నటించగల పాత్రలకు జీవం పోసి తెలుగు చలనచిత్ర సీమకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకొచ్చారని పొన్నూరు కొనియాడారు. అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య మాట్లాడుతూ అక్కినేని మీద ఉన్న అభిమానంతో కళాపరిషత్ స్థాపించి ఎన్నో సంగీత విభావరులు ఏర్పాటు చేయడమే కాకుండా సినీ రంగంలో ప్రముఖులైన కళాతపస్వి కె.విశ్వనాథ్‌ను తీసుకొచ్చి సన్మానించామని తెలిపారు. కొత్త కూరగాయల మార్కెట్ వద్ద ఎమ్మెల్యే బాలినేని సహకారంతో అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో చిన్న ఘంటసాల బాలరాజు, కల్లగుంట కృష్ణయ్య, విజయ్, పూర్ణిమ, రాజకుమారి, మారుతి పాడిన పాటలు అలరించాయి. కీబోర్డుపై ఇర్మియా, తబలపై శివ, జాజ్‌పై మోహన్‌రావు, రిథం పాడ్‌పై సురేష్ వాద్య సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో నూకతోటి శరత్కుమార్, మాస్టర్ సీహెచ్ లక్ష్మీనారాయణ, ఆలూరి రామారావు, అప్పిశెట్టి రత్తయ్య, ఎన్నూరి నాగేశ్వరరావు, జానకీరామ్, ఐ.నరసింహారావు, పాలకేంద్రం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

చీమకుర్తి: రానున్న ఎన్నికల్లో ఓటర్లు నూరు శాతం వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈఓ ఎస్.సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ డైట్ కాలేజీలో నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో ఆయనతో పాటు స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, కాలేజీ అధ్యాపకులు, ఎంపీడీఓ శ్రీహరి, డైట్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకుని ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తొలుత ఓటర్లకు ఓటు విలువ తెలియజేస్తూ గ్రామంలో బ్యానర్లతో ప్రదర్శన నిర్వహించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఒంగోలు డీఎస్పీ కిషోర్, సీఐ దుర్గాప్రసాద్

చీమకుర్తి: ఒంగోలు డీఎస్పీ కిషోర్, చీమకుర్తి సీఐ ఓ.దుర్గాప్రసాద్, ఎస్సై ఈవీ కృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం చీమకుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఓటర్లకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. అనంతరం ఎన్నికల సమయంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, నిష్పక్షపాతంగా అభ్యర్థులకు ఓటేయాలని వివరించారు. నాయుడుపాలెం, పాటిమీదపాలెం, అగ్రహారం గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

వృద్ధాశ్రమానికి గ్రైండర్ అందజేత



గ్రైండర్ అందిస్తున్న కేసీపీ ప్రాజెక్టు నిర్వాహకులు

ఒంగోలు సబర్బన్: ప్రముఖ పారిశ్రామికవేత్త కేసీ పుల్లయ్య ఫౌండేషన్ నిర్వాహకులు ఒంగోలు నగరంలోని సీతారాంపురంలో ఉన్న సమతా మహిళా వృద్ధాశ్రమానికి శనివారం గ్రైండర్ అందజేశారు. పుల్లయ్య 12వ వర్ధంతిని పురస్కరించుకుని ఫౌండేషన్ నిర్వాహకులు గ్రైండర్‌తో పాటు వృద్ధులకు పండ్లు, మిఠాయిలు కూడా అందించారు. ఫౌండేషన్ నిర్వాహకుడు గంగాధర్ మాట్లాడుతూ పారిశ్రామికవేత్త కేసీ పుల్లయ్య ఎంతో కష్టపడి అభివృద్ధిలోకి వచ్చారని, పేదలకు, వృద్ధులకు సాయం చేద్దామన్న ఉద్దేశంతో కేసీపీ ఫౌండేషన్‌ను స్థాపించారని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



క్షయ నివారణ ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

మద్దిపాడు: సమాజంలో క్షయ వ్యాధిని మట్టుబెట్టి క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మద్దిపాడు పీహెచ్‌సీ డాక్టర్ ఆనందమోహన్ అన్నారు. ఈ నెల 24వ తేదీ ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యాధిని గుర్తించిన వెంటనే సదరు వ్యక్తికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా చికిత్స అందించి ఆరోగ్యం కుదుటపడే వరకు నెలకు రూ.500 ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆశా వర్కర్లు గ్రామాల్లో క్షయ వ్యాధితో బాధపడేవారిని గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా సహకరించాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే వారి వద్ద కళ్లె శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన క్రమంలో వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందన్నారు. క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని, అందువలన క్షయ వ్యాధిగ్రస్తులు బయట తిరగకుండా చికిత్స తీసుకుంటే క్షయ వ్యాప్తి చెందకుండా నివారించవచ్చని తెలిపారు. అనంతరం మద్దిపాడు ప్రధాన వీధుల్లో క్షయ వ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు జగదీష్, శ్రావణ్, సీహెచ్ఓ రజనీకుమారి పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, హెచ్‌వీలు నాగరాజి, సీతమ్మ, ఎస్‌టీఎస్ చంద్రమౌళి, ఆర్ఎన్‌టీసీపీ సిబ్బంది వరలక్ష్మి సుష్మిత, ఆస్పత్రి వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

సర్వేయర్ రిజిస్టర్ల నిర్వహణపై డీఐఎస్ సంతృప్తి



సర్వేయర్లతో మాట్లాడుతున్న డీఐఎస్ సుబ్బారాయుడు

కొత్తపట్నం: సచివాలయాల సర్వేయర్లు నిర్వహిస్తున్న రిజిస్టర్లపై డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సుబ్బారాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం సర్వేయర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ పెట్టి సర్వేయర్లు చేరిన దగ్గర నుంచి రికార్డులు పరిశీలించామన్నారు. ఏమీ పెండింగ్ లేకపోవడం మంచి విషయమన్నారు. ఈతముక్కల, మడనూరు, పాదర్తి, రాజుపాలెం, పాయికారికండ్రిక రెవెన్యూ గ్రామాల రీ సర్వే పూర్తయిందన్నారు. సుమారు 18,500 ఎకరాల దాకా సర్వే చేయడం జరిగిందన్నారు. ఈ సర్వేకి సంబంధించి 13వ నోటిఫికేషన్ పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధీర్‌బాబు, సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.